# నేరం చేస్తే శిక్ష తప్పదు

## సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

## రెండు నెలల్లో 22 కేసుల్లో నిందితులకు జైలు శిక్ష






**ప్రజానావ, సిరిసిల్ల:** కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం,శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన పీపీ లను ,కోర్టు కానిస్టేబుళ్లను అభినదించి ప్రశంస పత్రాలు,ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిందితులకు శిక్షపడడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లది కీలకపాత్రని, పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సమన్వయ%శీ%తో నేరస్థులకు కచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసి శిక్షల శాతం పెరిగేలా పనిచేయటం అభినందనీయమని అన్నారు. పోలీస్ ఆదికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు కచ్చితంగా శిక్ష పడేవిధంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతికత కీలకంగా మారిందని అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు కచ్చితంగా జమ చేయాలన్నారు. గడిచిన రెండు నెలల్లో 22 కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన గంజాయి కేసులో నిందుతులకు ఐదేళ్లలు జైలు శిక్షలు కోర్టు ద్వారా విదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఎంఎస్ ఎస్ఐ లు శ్రవణ్ యాదవ్, రవీంద్రనాయుడు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



# ముందస్తు మహిళా దినోత్సవం

ప్రజానావ, మందమర్రి: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను జీ స్వరూపారాణి దేవేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగరేణిలో పనిచేస్తున్న మహిళలు, గృహిణిలు 200 మంది హాజరై ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మహిళా దినోత్సవం రోజు బహుమతులు బహూకరించరు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ సెల్ సేవాసమితి కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఎండీ ఆసిఫ్, డీవైపీఎం, మహిళా ఉద్యోగులు చుట్టు పక్క ప్రాంతాల ప్రజలు సేవా సభ్యులు పాల్గొన్నారు.



# సేవాలాల్ విగ్రహం తొలగింపును ఖండిస్తున్నాం

## లంబాడీల ఐక్యవేదిక సంఘం నాయకులు



**ప్రజానావ, నేరడిగొండ:** ఇబ్రహీంపట్నం మండలం లోయపల్లి గ్రామంలో లంబాడీ సమాజ ఆరాధ్య గురుదేవుడైన సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని పోలీసులు అన్యాయంగా తొలగించడాన్ని ఖండిస్తున్నామని గిరిజన లంబాడీల ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా లైవ్ సంఘం నాయకులు మంగళవారం నేరడిగొండ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోఆర్డినేటర్ రాథోడ్ సందీప్ మాట్లాడుతూ, "శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని తొలగించడం అన్యాయమని అదే స్థలంలో మళ్లీ విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోతే, లంబాడీ సమాజం అంతా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతాం" అని హెచ్చరించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమాజ మనోభావాలను గౌరవిస్తూ అదే స్థలంలో శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని పునరుద్ధరించాలి. లంబాడీ సమాజం ఆత్మగౌరవాన్ని కాపాడేలా తగిన చర్యలు తీసుకోవాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

# స్కూల్ అనుమతి రద్దు చేయకపోతే ఉద్యమం

## టీఎస్ఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్



**ప్రజానావ, ఉట్నూర్ :** ఉట్నూర్ కేంద్రంలోని సన్‌షైన్‌స్కూల్‌అనుమతిని రద్దు చేయకపోతే, ఉద్యమం చేస్తామని టీఎస్ఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంబ్లె ప్రజ్ఞశీల్ హెచ్చరించారు. మంగళవారం అంబేద్కర్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బోగస్ సర్టిఫికెట్ విషయంలో జిల్లా విద్యాధికారి సన్ షైన్ స్కూల్‌కు మద్దతుగా ఉన్నారని భావిస్తున్నామని, లేకుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యను వ్యాపారం గా చేసుకొని స్థానికేతరులు కోట్లు సంపాదించారని ఏజెన్సీ లో నిబంధనలు అతిక్రమించారని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగదేవ్ పటేల్ అన్నారు. రెండు నెలలుగా విద్యార్థి సంఘాలు కలెక్టర్, డిఈఓ,ఎంఈఓ లకు వందల సంఖ్యలో పిర్యాదులు చేశామన్నారు .సన్ షైన్ స్కూల్ యాజమాన్యం పై తల్లి తండ్రుల నుండి అనేక కంప్లైంట్ వస్తున్నాయన్నారు. సన్ షైన్ యాజమాన్యం తమ పలుకుబడితో విద్యార్థి సంఘ నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లా విద్యాధికారి విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించారని, డీఈఓకు పేద పిల్లల చదువు కన్నా స్కూల్ యాజమాన్యాలను రక్షించే పనిలో ఉన్నారని డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజషన్ ప్రెసిడెంట్ నేతావత్ రవి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా రేపటి సన్ షైన్ స్కూల్ ముట్టడి వాయిదా వేశామన్నారు. ఇప్పటికైనా ఆదిలాబాద్ కలెక్టర్ ఈ వ్యవహారం పై సమగ్ర సమాచారం తీసుకోని స్కూల్ అనుమతి రద్దు చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని, కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ ఆఫీస్ ముట్టడికి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. సన్ షైన్ స్కూల్ మూసేవరకు తాము రిలే నిరాహార దీక్ష కు సిద్ధం గా ఉన్నామన్నారు.

# మళ్లీ హైడ్రా పంజా

## నిజాంపేటలో రహదారి ఆక్రమణల తొలగింపు.. ● ఏడెనిమిది కాలనీలకు తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు



**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో హైడ్రా మరోసారి పంజా విసిరింది. నిజాంపేటలో రహదారి ఆక్రమణల తొలగించింది. దీంతో ఏడెనిమిది కాలనీలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగాయి. నిజాంపేట మున్సిపాలిటీ వార్డ్ నంబర్ 12లోని బాలాజీ హిల్స్, ఇందిరమ్మ కాలనీ రహదారుల ఆక్రమణలను హైడ్రా మంగళవారం తొలగించింది. రహదారులను ఆక్రమించిన స్థానికులు అపార్ట్‌మెంట్ ర్యాంపులు, రోడ్డు మీదకు జరిగి మొక్కలకోసం ఫెన్సింగ్ లతో పాటు.. పై అంతస్తులకు చేరేందుకు ఐరన్ ఫ్రేమ్ మెట్లను ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ కాలనీలో రహదారులను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు, అదనంగా గదులు నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంకటరాయనగర్, బాలాజీ కాలనీ, కేఎన్ ఆర్ కాలనీ, కొలను తులసి రెడ్డి (కేటీఆర్) కాలనీలకు వెళ్లేందుకు వీల్లేకుండా ట్రాఫిక్ జామ్ అవుతుందని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. ఓల్డ్ ఏజ్ హోం నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ కు నిజాంపేట రహదారుల మీదుగా వెళ్లే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఉదయం, సాయంత్రం వేళ పాఠశాల మినీ బస్సులు, అత్యవసర వాహనాలు కూడా తిరగలేని దుస్థితిపై బాలాజీ హిల్స్ కాలనీవాసుల ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణలపై కోర్టును ఆశ్రయించామని.. తొలగించడానికి కోర్టు తీర్పు ఉన్నా ఎలాంటి చర్యలు చేపట్టలేదంటూ స్థానికుల ఆరోపించారు. ఆక్రమణలు తొలగించాలంటూ రెండు నెలలు గడువు ఇచ్చినా.. ఫలితం లేకపోవడంతో నిజాంపేట మున్సిపల్ అధికారుల సమక్షంలో హైడ్రా చర్యలు చేపట్టింది. రోడ్డుమీదకు వచ్చిన కట్టడాలు, దుకాణాలు, ఫెన్సింగ్‌ల తొలగించింది. బాలాజీ హిల్స్ కాలనీలోని పలు రహదారుల తో పాటు అక్కడ ఇందిరమ్మ కాలనీ దారుల్లో కూడా కబ్జాలను తొలగించింది. బాలాజీహిల్స్ కాలనీతో పాటు.. నిజాంపేట మున్సిపాలిటీ 12వ వార్డు నివాసితులు హైడ్రా కూల్చివేతలకు సహకరించారు. రహదారులను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం, అదనంగా గదులు నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ ఇందిరమ్మ కాలనీ వాసులకు చెప్పిన అధికారులు వాటిని తొలగించారు.' కిలోమీటరుకు పైగా ఉన్న ఆక్రమణలు తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆక్రమణల తొలగింపుతో ట్రాఫిక్ ఇబ్బంది ఉండదంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మెట్రో రైలుతో పాటు ప్రధాన రహదారికి సులభంగా చేరుకునే అవకాశం లభించందంటూ బాలాజీహిల్స్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



